# 2023

## 4 ఆఫీస్ యోగా



**కొవిడ్** తర్వాత ఆఫీసు పని ఇంటినుంచే– రిమోట్‌గా జరుగుతున్నది. ఈ క్రమంలో మనం వాడే కంప్యూటర్ కూడా మార్పులు చేసుకుంటున్నది. లెనోవో యోగా బుక్ 9ఐ అలాంటి చేర్పులతో వచ్చిందే. దీని తయారీకి మూలం ఓ కాఫీ షాప్ కావడం గమనార్హం. మాట్లాడుకోవడానికి కాఫీ దుకాణానికి వచ్చిన వాళ్లు తమ ల్యాప్‌టాప్‌లను రకరకాల భంగిమల్లో వాడాల్సి వచ్చేది. కీబోర్డ్ చిన్నగా ఉండటంతో ఆ పని ఇబ్బందిగా ఉండేదని 'యోగా బుక్' రూపశిల్పుల్లో ఒకరైన బ్రయాన్ లియోనార్డ్ అంటారు. ఇక 13.3 అంగుళాల కొలతతో రెండు తెరలు కలిగిన లెనోవో యోగా బుక్‌ను నాలుగు రకాలుగా వాడుకోవచ్చు. సంప్రదాయ పర్సనల్ కంప్యూటర్, ట్యాబ్, టెంట్ పొజిషన్, నిల్చున్నట్టుగా... ఇలా నాలుగు రకాలుగా సర్దుబాటు చేసుకోవచ్చు. పైగా ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి ఓఎల్ఈడీ రెండు తెరల ల్యాప్‌టాప్ కావడం విశేషం. ఒంటి చేత్తో రెండు తెరల మీద యాప్స్‌ను వాడుకోగలగడం దీని ప్రత్యేకత.

## 5 లైట్స్.. కెమెరా.. యాక్షన్

**సినిమా** తీయడానికి ఉపయోగించే అత్యాధునిక కెమెరా ఖరీదు లక్ష డాలర్ల (సుమారు కోటి రూపాయలు)కు పైగానే ఉంటుంది. దీనికి భిన్నంగా ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు గారెత్ ఎడ్వర్డ్స్ ఇటీవల విడుదల చేసిన సై-ఫై ఎపిక్ చిత్రం 'ద క్రియేటర్'ను ప్రధానంగా సోనీ ఎఫ్ఎక్స్3 కెమెరాతో తీశాడు. దీని ఖరీదు 4,000 డాలర్ల లోపే. అయితేనేం, హై ఎండ్ కెమెరాకు నాణ్యతలో దీటుగా నిలుస్తుంది. ప్రేక్షకులు కూడా ఈ తేడాను పసిగట్టలేరు. ఎఫ్ఎక్స్3 కెమెరా తేలికగా, చేతిలో ఇమిడిపోయేలా ఉంటుంది. ఇక దీని శక్తి అంతా కాంతిని గ్రహించడంలోనే ఉంటుంది. ఈ లక్షణం కారణంగానే ఎడ్వర్డ్స్ రాత్రి వేళల్లో కూడా అదనపు వెలుతురు అవసరం లేకుండానే 'ద క్రియేటర్' చిత్రాన్ని మలచాడు. 'ఇక మీరు వెన్నెలలో కూడా సినిమా తీయగలరు' అని ఎఫ్ఎక్స్3 గురించి ఎడ్వర్డ్స్ కితాబిచ్చాడు.




## 6 సరికొత్తగా దంతధావనం

**శారీరక లోపాలు** ఉన్నవాళ్లకు పళ్లు తోముకోవడం, నోరు శుభ్రం చేసుకోవడం కొంత కష్టమైన పనే. అంతేకాదు, దంతక్షయం 88 శాతం మందికి తీవ్ర సమస్యగా పరిణమించింది. 20 ఏండ్లకు పైగా దంత సంరక్షణ పరిశ్రమలో పని చేస్తున్న స్టీఫెన్ ముల్లర్ ఈ విషయాన్ని గుర్తించారు. పరిష్కారం కోసం తీవ్రంగా ఆలోచించారు. ఆయన స్విట్జర్లాండ్‌కు చెందిన దంతాల ఆరోగ్య సంబంధమైన కంపెనీ క్యూరా ప్రాక్స్‌లో మేనేజింగ్ డైరెక్టర్‌గా సేవలు అందిస్తున్నారు. ఇప్పుడు మార్కెట్‌లో వైబ్రేటింగ్ బ్రష్‌లు దొరుకుతున్నాయి. కానీ, వీటివల్ల నోరు మూలమూలలా శుభ్రం చేసుకోవడం సాధ్యం కావడం లేదు. దీన్ని సవరించేదుకు క్యూరాప్రాక్స్ కొత్తగా సాంబా రొబోటిక్ టూత్‌బ్రష్‌ను తీసుకొచ్చింది. ఆంగ్లాక్షరం 'యు' ఆకారంలో ఉండే ఈ బ్రష్‌లో మొత్తం 12,900 మెత్తటి బ్రిసిల్స్ ఉంటాయి. ఇవి దంతాల మూలల్లోకి వెళ్లి నోటిని శుభ్రం చేస్తాయి. అలా నోటి ఆరోగ్యాన్ని కాపాడుతాయి..

